పంట బోదెలను మింగేస్తున్న ఆక్వా చెరువులు

- నిడమర్రు–పత్తేపురం రోడ్డు వెంబడి ఇదే పరిస్థితి
- చెరువుల్లోని ఊటనీటితో రహదారులు ఛిద్రం
- చోద్యం చూస్తున్న ఆయా శాఖల అధికారులు

నిడమర్రు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చేస్తున్న ఆక్వా సాగుతో పంట బోదెలు, ఆర్‌అండ్‌బీ రహదారులను చెరువులు మింగేస్తున్నాయి. చెరువుల విస్తీర్ణం పెంచేందుకు స్వార్థపరులైన ఆక్వా రైతులు చెరువులకు ఆనుకొని ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారులను, ఇరిగేషన్ పంట, మురుగు బోదెలను కలిపేసుకొని చెరువు గట్లు వేసుకుంటున్నారు. అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేయకుండానే నూతన ఆక్వా చెరువులకు అనుమతులు, చెరువు మరమ్మతులకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీంతో ఆక్వా చెరువుల భూ యజమానులు ఇష్టానుసారంగా చెరువుల తవ్వకాలు చేపట్టి బోదెలను, రహదారులను ఆక్రమిస్తున్నారు. ఈ ఆక్రమణల వలన ఆయా చెరువుల విస్తీర్ణం ఎకరాకు 10 నుంచి 20 సెంట్ల వరకూ అదనపు భూమి కలిసి రావడంతో ఒకరిని చూసి మరొకరు ఆక్రమణ పర్వానికి తెర తీస్తున్నారు. నియోజకవర్గంలోని మత్స్యశాఖ అధికారులు, ఆయా మండలాల ఇరిగేషన్, డ్రెయినేజీ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఒక్కసారి కూడా పరిశీలన చేయకపోవడం గమనార్హం.

రహదారులకు ఇరువైపులా ఆక్రమణలు

మండలంలోని మందలపర్రు నుంచి నిడమర్రు మీదుగా పత్తేపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిని పరిశీలిస్తే గతంలో కనిపించిన పంట బోదెలు, మురు గు డ్రెయిన్లు కబ్జాతో చెరువుల్లో కలిసిపోయాయి. దీంతో పలు చోట్ల ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా చెరువులు తవ్వడంతో రోడ్లు విస్తీర్ణం కుదించుకుపోయినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. ఇలా ఆక్రమణలతో వర్షాకాలంలో ఆయా ప్రాంతాల్లోని రహదారులు ముంపు నీటితో మునుగుతున్నట్లు చెబుతున్నారు. ఆక్వా చెరువుల భూ యజమానులు తమ భూములవరకే చెరువుల తవ్వకాలు చేపడితే సమస్య పరిష్కారం అవుతుంది. నిబంధనలు అతిక్రమించి తవ్వడంతో అనేక ఇబ్బందులు వస్తున్నట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు.



పత్తేపురంలో చెరువుల్లోని ఊట నీటితో అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఊట నీటితో రహదారులు అధ్వానం

ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రహదారులకు ఆనుకొని ఉన్న ఆక్వా చెరువుల యజమానులు తమ చెరువు గట్లను రోడ్డు కంటే మీటరు వరకూ ఎత్తు వేయడం వలన చెరువుల్లోని ఊట నీరు రోడ్డు పైకి చేరి రహదారులు గోతుల మయమైంది. దీంతో వాహనాల రాకపోకలకు మరింత ఇబ్బందిగా ఆ రోడ్లు మారుతున్నాయి. పెదనిండ్రకొలను నుంచి పత్తేపురం వెళ్లే మార్గంలోని చెరువుల వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ రహదారిని ఆనుకొని ఉన్న చెరువుల్లోని ఊట నీరు నిత్యం రోడ్ల పైకి వస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. అలాగే ఆ నీరు నిల్వ ఉండటంతో ఒక్కో సారి దుర్వాసన వెదజల్లుతోందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



ఆక్వా చెరువుల తవ్వకాలు, మరమ్మతులతో ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయి. భూ యజమానులకు అధికారుల మద్దతు ఉండటంతోనే చెరువులకు ఆను కుని ఉన్న పంట బోదెలు, మురుగు డ్రెయిన్లను చెరువుల్లో కలిపేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువుల్లోని ఊటనీటితో రోడ్లు మరమ్మతుల పాలవుతున్నాయి.

– నారపల్లి రమణారావు, బువ్వనపల్లి

చెరువుల తవ్వకాల్లో నిబంధనలు పాటించాలి



చెరువుల తవ్వకాల్లో భూ యజమానులు నిబంధనలు పాటించేలా ఆయా శాఖల అధికారులు పర్యవేక్షించాలి. ఆక్వా చెరువుల ఆక్రమణలతో పంట కాలువలు కుదించుకుపోతున్నాయి. వర్షాకాలంలో నీటి పారుదల నిర్వహణ సరిగా లేక దిగువన ఉన్న పంట పొలాలు మునిగిపోతున్నాయి.

– గొట్టుముక్కల విశ్వనాథరాజు, బావాయిపాలెం



ఆక్వా ఊటనీటితో అధ్వానంగా మారిన పెదనిండ్రకొలను రోడ్డు



నిడమర్రులో పంట బోదెను ఆక్రమించి వేసిన ఆక్వా చెరువు గట్టు

ఊరిస్తున్న మబ్బులు.. కానరాని వాన



ఆకాశంలో ఊరిస్తున్న మబ్బులు

- వర్షం కోసం రైతన్న ఎదురు చూపు
- ఆరు పదునులో పొలాలు



దుక్కి దున్నిన పొలం

పెదవేగి: మబ్బులు వేస్తూ, ఉరుములు ఉరుముతూ వర్షం పడినట్లే పడి, చిరు జల్లులతో వెనుదిరుగుతోంది. వారం రోజుల క్రితం ఒకసారి మాత్రమే కొన్ని గ్రామాల్లో గట్టి వర్షం కురిసింది. అయితే ఆ వర్షానికి పొలాలు పూర్తి స్థాయిలో పదును కాలేదు. కురిసిన చోట ఆరు పదును కావడం, మరికొన్ని చోట్ల అదీ లేకపోవడంతో రైతులు వర్షంకోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. పొలాలు పదునైనా కాకున్నా దుక్కి దున్ని పంటలకు సిద్ధం చేసు కుంటున్నారు. మరి కొన్ని చోట్ల దుక్కి కూడా అవ్వక వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురిసి దున్నిన ప్రాంతాల్లో గొర్రు తోలి విత్తనాల విత్తుకు సిద్ధమయ్యారు. ఆ ప్రాంతాల్లో మరో సారి పెద్ద వర్షం కురిస్తేనే విత్తనాలు నాటేందుకు వీలవుతుంది. కొన్నిచోట్ల గతంలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు విత్తనాలు నాటడంతో ఆ విత్తనాలు కాస్త నేలలో మగ్గి మొక్క మొలవకుండా పాడయ్యాయి. మళ్లీ వర్షం కురిస్తే దున్నుకొని విత్తనాలు వేసేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు.

పంటలు వేయాలా.. వద్దా?

ఒక గ్రామంలో వర్షం ఉంటే మరో గ్రామంలో ఉండదు. ఏ రైతు చూసినా ఇతర గ్రామాలకు ఫోన్లు చేయడం, మీకు వర్షం కురిసిందా అని సమాచారం తెలుసుకోవడమే పనిగా పెట్టుకున్నాడు. బోర్లపై ఆధారపడి పండించే పంటలు అధిక నీరు అవసరమైన పంటలు వేసే వారి పరిస్థితి అయోమయంగా ఉంది. ప్రస్తుత తరుణంలో వరి, నారు పోసుకునే పరిస్థితి. నారు పోస్తే వర్షాలు పడి బోర్లలోకి నీరు వస్తాయో లేదోనని అయోమయంలో రైతులు ఉన్నారు. వ్యవసాయాధికారులు ఖరీఫ్ నియోజకవర్గంలో 42,500 వేల ఎకరాల్లో సార్వా సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అయ్యారని చెప్పగా, ఆశించిన రీతిలో పంట పండుతుందో లేదోనని ఆలోచనలో పడ్డారు. ఒక వేళ బోర్లలో నీరు రాలేదంటే అధిక పెట్టుబడులు పెట్టి రైతులు నష్టపోయే పరిస్థితి ఉంటుంది. దీంతో కొందరు రైతులు అధిక నీటితో అవసరమైన పంటలకు దూరమవుతున్నారు. ప్రస్తుతం భారీ వర్షం కురిస్తేనే రైతులకు మేలు కలుగుతుంది.

వర్షాలొస్తే సాగుకు సిద్ధం

ఖరీఫ్ ప్రారంభమైనా వాన జాడ లేదు. దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేశా. రెండు వారాల నుంచి ఆకాశం మబ్బులు పడుతుందే తప్ప, చినుకు మాత్రం పడడం లేదు. ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నాం. వాన దేవుడు కరుణిస్తే తప్పా సాగుకు సిద్ధమయ్యే పరిస్థితి కనబడడం లేదు.

– ఎస్.సోమయ్య, కౌలు రైతు, నాగన్నగూడెం

ఈకేవైసీ చేయించుకున్న రైతులకే అన్నదాత సుఖీభవ

చింతలపూడి: సబ్ డివిజన్‌లోని అర్హత కలిగిన రైతులు అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ ఆదివారం సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందాలంటే ఓటీపీ ద్వారా నమోదు చేసే అవకాశం లేదని చెప్పారు. రైతులు రైతు సేవ కేంద్రం వద్ద ఈకేవైసీ వేలిముద్ర వేసిన రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. సోమవారం రైతు సేవా కేంద్రాల వద్ద ఉన్న అర్హుల జాబి తాను రైతులు పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగనన్న కాలనీపై కూటమి చిన్నచూపు



గుండుగొలనులో జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లు



కాలనీకి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలే లేని దృశ్యం

- వైఎస్సార్‌సీపీ హయాంలో 1147 మందికి ఇళ్ల స్థలాలు
- కాలనీ దారిలో వీధి దీపాల ఏర్పాటుకు వేడుకోలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

భీమడోలు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద వారికి సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేట్ స్థలాలను కోట్లాది రూపాయలతో కొనుగోలు చేసి, లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దీంతో వారు అక్కడ గృహాలు నిర్మించుకుని సంతోషంతో జీవితాన్ని సాగిస్తున్నారు. దీంతో లబ్ధిదారుల ఇళ్లతో జగనన్న కాలనీ ఊరిని తలపిస్తుంది. కాని తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ కాలనీపై శీతకన్ను వేసింది. కాలనీ సమస్యలను పట్టించుకోవడం లేదు. కాలనీకి వెళ్లే దారిలో వీధి దీపాలు లేక పలు ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. వాటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గుండుగొలనులో దశాబ్దాలుగా గత పాలకులు సెంటు భూమిని కూడా ఇవ్వలేదు. అలాంటి సాహసం కూడా చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాల పథకాలు చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ సెంటున్నర చొప్పున స్థలాన్ని అందించింది. అప్పటి ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషి ఫలితంగా గుండుగొలనులో 25 ఎకరాల భూమిని కోట్లాది రూపాయలతో కొనుగోలు చేసి లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి సమీపంలోని గోదావరి గట్టు పక్కనే లేఅవుట్ సిద్ధం చేసి అందులో 1147 మంది లబ్ధిదారులకు స్థలాలు ఇచ్చారు. ఈ లేఅవుట్‌లో స్థలాలు పొందిన వారిలో వేయి మంది వరకు ఇళ్లు నిర్మించుకున్నారు. అక్కడి లబ్ధిదారులు జగనన్నపై కొండంత అభిమానాన్ని పెంచుకున్నారు. దీంతో అప్పట్లో వాసుబాబు కృషి వల్ల జగనన్న కాలనీలోని ప్రధాన రోడ్డుకు నిధులు మంజూరు కాగా కూటమి ప్రభుత్వ హయాంలో ఆ నిధులతో ప్రధాన రోడ్డును నిర్మించారు. ఇదిలా ఉండగా ఆ కాలనీలోని వందలాది మంది ప్రజలు అర కిలోమీటర్ దూరం తమ కాలనీకి వెళ్లాలంటే కాలువ గట్టుపై నుంచే రాకపోకలు సాగించాల్సిందే. రాత్రి వేళల్లో ఆ గట్టుపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. దీనికి తోడు ఆ గట్టుపై వంపులు తిరిగిన భారీ వృక్షం ఉండడంతో వాహనదారులు ఆదమరిస్తే ఈ చెట్టును ఢీకొట్టాల్సిందే. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. లేకుంటే కాలువలో పడాల్సిందే. దీనితో కాలనీ వరకు విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో కాలనీ వాసులు రాత్రి వేళల్లో నడవాలంటేనే భయంతో భీతిల్లిపోతున్నారు. వర్షాకాలంలో నడకే కష్టంగా ఉందని, వాహనాలు అదుపు తప్పుతున్నాయని వాపోయారు. ఆ చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నా, ఆ గట్టు వెంబడి విద్యుత్ స్తంభాలు వేస్తే ప్రమాదాల నివారణ సాధ్యమని కాలనీ వాసులు కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్థానిక ప్రజా ప్రతినిధులకు ‘కూటమి’ షాక్

- తల్లికి వందనం పథకం నిలిపివేత
- రూ.3 వేలు గౌరవ వేతనం పొందటమే కారణమా ?
- గత ప్రభుత్వంలో అన్ని పథకాలు వర్తింపు



ఏలూరు మండల పరిషత్ సమావేశంలో సర్పంచులను తల్లికి వందనం పథకానికి అనర్హులుగా ప్రకటించడంపై నిలదీస్తున్న సర్పంచులు (ఫైల్)

దెందులూరు: తల్లికి వందనం పథకం నిబంధనల అమలులో కూటమి ప్రభుత్వం స్థానిక ప్రజా ప్రతినిధులకు మొండి చేయి చూపింది. ఈ పథకం రూ.3 వేల గౌరవ వేతనం అందుకుంటున్న గ్రామ సర్పంచులకు శాపంగా మారిందని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక నేతలను ఏ ప్రభుత్వ పథకాలకూ అనర్హులను చేయలేదు. దెందులూరు నియోజకవర్గంలో జాలపూడి గ్రామ సర్పంచ్ నవ్య కుమారుడికి తల్లికి వందనం పథకం వర్తింప చేయలేదు. తిరస్కరించిన కారణం సర్పంచ్‌ను ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించి, సమాచారం పంపారు. గ్రామీణ ప్రాంతాల్లో 75 శాతం ఎస్సీ, బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన సర్పంచులు, ఎంపీపీలు జెడ్పీటీసీలే ఉన్నారు.

సర్పంచ్‌ల సంఘాల ఆగ్రహం

ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకుంటున్న కారణంగా వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా కూటమి ప్రభుత్వం పరిగణించి తల్లికి వందనం పథకంలో అనర్హులుగా అధికారికంగా గుర్తించడంపై సర్పంచ్ సంఘాలు, దళిత గిరిజన మైనారిటీ వర్గాల ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల జరిగిన ఏలూరు మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు అధికారులను నిలదీశారని తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు అయితే వారి మాదిరిగా అన్ని రాయితీలు వర్తింపజేస్తారా అని సర్పంచులు పట్టుబట్టారు. ఈ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి తల్లికి వందనం అమలులో స్థానిక ప్రజా ప్రతినిధులను అర్హులుగా ప్రకటించాలని కోరుతున్నారు.

నా కుమారుడికి తల్లికి వందనం రాలేదు



నా కుమారుడికి తల్లికి వందనం పథకం వర్తింపజేయలేదు. తిరస్కరించిన కారణం నన్ను ప్రభుత్వ ఉద్యోగి అని నిర్ధారించారు. ఇది చాలా బాధాకరం. గౌరవ వేతనం తీసుకున్న వాళ్లు ప్రభుత్వ ఉద్యోగులు ఎలా అవుతారు. వారిని ఈ పథకానికి అర్హులుగా ప్రకటించాలి. లేకుంటే ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే రాయితీలు కల్పించాలి.

– నవ్య, గ్రామ సర్పంచ్, జాలిపూడి

గత ప్రభుత్వంలో ఇలా జరగలేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి నిబంధన లేదు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకానికైనా అర్హులైతే వారు ఏ రాజకీయ పార్టీ అని చూడకుండా కచ్చితంగా అందరికీ పథకం అమలు చేయాలని పదేపదే చెప్పారన్నారు. కానీ మొదటి సంవత్సరంలోనే కూటమి ప్రభుత్వం గౌరవ వేతనం తీసుకుంటున్నామనే సాకుతో తల్లికి వందనం పథకం ఆపడం తీవ్ర బాధాకరం. ఇది సరైన నిర్ణయం కాదు.

– అప్పన పద్మావతి, వైస్ ఎంపీపీ, పెదపాడు

కూటమి ప్రభుత్వం పునరాలోచించాలి



స్థానిక ప్రజా ప్రతినిధుల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తించకపోవడం బాధాకరం. ఈ రకమైన నిర్ణయం తీసుకోవడం తగదు. దీనిపై కూటలమి ప్రభుత్వం తక్షణమే స్పందించి పునరాలోచించాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరిగానే పథకం అమలు చేయాలి.

– పర్వతనేని శ్రావణి సుధీర్, సర్పంచ్, రామారావుగూడెం

క్లుప్తంగా

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



ఫాదర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఫాదర్

దెందులూరు: గ్రామ గ్రామాన ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇళ్లు, చర్చిల కమ్యూనిటీ హాల్ విద్యా సంస్థలు, ప్రైవేట్ సంస్థల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో తండ్రులను గౌరవించారు. కేకులు కట్ చేసి శుభాకాంక్షలు చెప్పి ఆశీర్వాదాలు తీసుకున్నారు. దెందులూరు గొడవీధిలో సాల్వేషన్ ఆర్మీ మేన్ చర్చిలో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోర్ ఆఫీసర్ రమణయ్యను సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం



పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: పుస్తక పఠనంతోనే విద్యార్థులకు జ్ఞానం సాధ్యమవుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథ పాలకుడు చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను తెలియజేశారు. తొలుత విద్యార్థులు పుస్తక పఠనం చేసి, వారి అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో భీమడోలు, పూళ్ల గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత

కొయ్యలగూడెం: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (తాడేపల్లిగూడెం రోడ్డు) నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు మేకల అన్నవరం, కోశాధికారి విశ్వనాథ శర్మ తెలిపారు. శ్రీ లక్ష్మి గణపతి స్టీల్స్ యజమాని ప్రగడ వీరభద్ర స్వామి రూ.10,116, తాడేపల్లిగూడెంకి చెందిన ఆర్‌పిఎస్ఎల్ ప్రసాద్ రూ.5 వేలు అందజేసినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు అందించాలని కోరారు.

మహాకవి శ్రీశ్రీ వర్ధంతి

కొయ్యలగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం మహాకవి శ్రీశ్రీ వర్ధంతి నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. శ్రీశ్రీగా ప్రపంచానికి పరిచయం అయిన శ్రీరంగం శ్రీనివాసరావు విప్లవ కవిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా ప్రజల హృదయాల్లో నిలిచారని రాముడు విద్యార్థులకు వివరించారు. ఎందరో యువ కవులకు శ్రీశ్రీ స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం అత్యంత ప్రజాదరణ పొందిన రచనల్లో ఒకటనీ, ప్రతి విద్యార్థి మహాప్రస్థానం గురించి తెలుసుకోవాలన్నారు.

ముగిసిన గంగానమ్మ జాతర

కొయ్యలగూడెం: పోతవరం గ్రామదేవత శ్రీ గంగానమ్మ (ఊడుగులమ్మ) అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ముగిసింది. గత 15 రోజులుగా నిర్వహిస్తున్న జాతర ఉత్సవాల్లో భాగంగా 14వ తేదీ రాత్రి అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా ఆఘం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు మరుసటి రోజు బంధుమిత్రులను జాతర విందుకు ఆహ్వానించడంతో పరిసర గ్రామాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలి వెళ్లారు. ముగింపు రోజు అమ్మవారి దర్శనంతో పాటు జాతర ఉత్సవాన్ని తిలకించేందుకు ఏజెన్సీ మెట్ట ప్రాంత నుంచి ప్రజలు ఆదివారం భారీగా తరలివచ్చారు. దీంతో బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

గంగానమ్మకు జలాభిషేకం

జంగారెడ్డిగూడెం: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో విరాజిల్లాలని కోరుతూ పట్టణంలోని గంగానమ్మ తల్లికి ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. సువాసినులు అమ్మవారికి బిందెలతో శాస్త్రోక్తంగా జలాభిషేకం జరిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.

జంగారెడ్డిగూడెంలో సత్యసాయి రథయాత్ర

జంగారెడ్డిగూడెం: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి రథయాత్ర ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో వైభవంగా జరిగింది. భక్తులు మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్య సాయి 100వ పుట్టినరోజు వేడుక సెప్టెంబర్ 23న పుట్టపర్తి ప్రశాంతి నిలయం నందు జరుపబడుతుందన్నారు. ఆహ్వాన కార్యక్రమంలో భాగంగా స్వామివారి రథయాత్ర ద్వారా పాదపద్మ దర్శనం అందరికీ కల్పిస్తూ ముందుకు సాగుతున్నట్లు వివరించారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజు బదిలీ

దెందులూరు: కొవ్వలిలోని నియోజవర్గ స్థాయి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గోల్డెన్ రాజు నర్సాపురం హాస్టల్‌కు బదిలీ అయ్యారు. హాస్టల్లో ఒక ఏవో ఇద్దరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉండగా రాజు బదిలీతో ఒక ఖాళీ ఏర్పడింది. హాస్టల్లో వెల్ఫేర్ ఆఫీసర్ భర్తీపై జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చామని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏవో సత్యనారాయణ వివరించారు.

పంచాయతీ స్థలంలోని చెట్లు నరికివేత

కొయ్యలగూడెం: కన్నాపురం పంచాయతీ మహాదేవపురం గ్రామంలో ఆదివారం చెట్లు నరికి వేయడం వివాదాస్పదమైంది. పంచాయతీ వాటర్ ట్యాంకు ఉన్న ప్రాంతంలో సుమారు ఇరవై సెంట్లకి పైగా ఉన్న స్థలంలో కొందరు వ్యక్తులు విలువైన జామాయిల్, మారుజాతి కలపను నరికి వేశారని రైతులు ఆరోపించారు. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదని, చెట్లు అక్రమంగా నరికిన వ్యక్తులు ప్రభుత్వ సెలవు రోజుల్లో కావాలనే ఈ దుశ్చర్యకు ఒడికట్టారని స్థానికులు ఆరోపించారు. దీనిపై పంచాయతీ శాఖ అధికారులు విచారణ చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఏలూరు టౌన్: తాళం వేసిన ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారం నగలు గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయిన ఘటన ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని తూర్పు వీధి కల్పనా బేకరీ సమీపంలో కామాడ జాబిల్లి అనే వృద్ధురాలు నివాసం ఉంటుంది భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా జీవిస్తుంది. ప్రస్తు తం బ్రిలియంట్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్గా పనిచేస్తున్నారు ఈ క్రమంలో ఆదివారం ఉదయం వ్యక్తిగత పనులు నిమిత్తం ఆమె ఇంటికి తాళాలు వేసి బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసు కునేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉండాల్సిన 60 కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గుర్తించింది. వెంటనే ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసు లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి.. ఏడుగురి అరెస్ట్

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో ఒక పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. భీమడోలు సీఐ యుజే విల్సన్‌కు అందిన సమాచారం మేరకు ఆయన ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.39 వేలు నగదు, 11 సెల్‌ఫోన్‌లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఏరియా హాస్పిటల్ కార్మికుల ధర్నా

జంగారెడ్డిగూడెం: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షుడు జంపన వెంకట రమణ రాజు మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ ఏజెన్సీను తొలగించి ప్రభుత్వమే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు.